


పెళ్లి సందడి

మూడు నెలల్లో 30 ముహూర్తాలు...

ఈ యేడాది వివాహ ముహూర్తాలు తక్కువగానే ఉన్నాయని పురోహితులు చెబుతున్నారు. మాఘ మాసం ప్రారంభమవుతున్న ఈనెల 11వ తేదీ నుంచి శ్రీకోధి నామ సంవత్సర చైత్ర మాసం వరకూ అంటే ఏప్రిల్ 26వ తేదీ వరకు మూడు నెలల్లో కేవలం సుమారు 30 వివాహ ముహూర్తాలు మాత్రమే ఉన్నాయంటున్నారు. ఏప్రిల్ 28వ తేదీ నుంచి మూఢం ప్రారంభం కానుంది. దీంతో వైశాఖం, జ్యేష్ఠ మాసాల్లో వివాహ ముహూర్తాలు లేవని పంచాంగ కర్తలు వివరిస్తున్నారు. ఆ తరువాత ఆషాఢం శూన్య మాసం కావడంతో శుభకార్యాలకు పనికి రాదని, మళ్లీ శ్రావణ మాసం అంటే ఆగస్టు నుంచి తిరిగి వివాహాలు జరిపించుకోవచ్చని పురోహితులు చెబుతున్నారు. సాధారణంగా ఏటా చైత్ర శుద్ధ నవమి అంటే శ్రీరామ నవమి అనంతరం వివాహాది శుభకార్యాలు ప్రారంభమవుతాయి. ఆ తరు వాత వైశాఖ మాసం వేసవి కాలం అయినప్పటికీ వివాహాలు ఎక్కువ గా నే ఉన్నాయి. అయితే ఈ సారి వైశాఖ మాసం అంతా మూఢం కావ డం తో వివాహాలన్నీ చైత్రంలో అంటే ఏప్రిల్ 26వ తేదీ లోపే జరిగే అవకా శం ఉంది. ఈ మూడు నెలల ముహూర్తాల్లో సుమారు వెయ్యికి పైగా వి వాహాలు జరుగుతాయని అంచనా వేస్తున్నారు.



- ఈనెల 11వ తేదీ నుంచి మాఘ మాసం ప్రారంభం
- ఏప్రిల్ 26 వరకు వివాహాల కోలాహలం
- ఆ తరువాత మూఢం
- తిరిగి శ్రావణంలోనే ముహూర్తాలు
- ముందస్తుగా పంక్షన్ హాళ్లు, క్యాటరింగ్ బుకింగ్

జగిత్యాల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివాహాల కోలాహలం ఆరంభం కానుంది. ఈనెల 11వ తేదీ నుంచి మాఘ మాసం ప్రారంభం అవుతుండడంతో మంచి ముహూర్తాల్లో పెళ్లిళ్ల జరిపించడానికి తల్లిదండ్రులు సిద్ధమవుతున్నారు. మాఘ మాసం నుంచి శ్రీకోధి నామ సంవత్సర చైత్ర మాసం వరకూ అంటే ఏప్రిల్ 20వ తేదీ వరకు మూడు నెలల్లో మంచి ముహూర్తాలున్నాయి. సుమారు రెండు నెలల విరామం అనంతరం మళ్లీ వివాహాలు మొదలు అవుతుండడంతో కల్యాణ మండపాల వద్ద పెళ్లి బృందాల సందడి మొదలు కానుంది. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో మూడుముళ్లతో వందల సంఖ్యలో నవ జంటలు ఒక్కటి కానున్నాయి. ఇందుకు అనుగుణంగా యువతీ యువకుల తల్లిదండ్రులు ముందస్తు పెళ్లి పనుల్లో బిజీబిజీగా ఉంటున్నారు.

శుభ ఘడియలు..ఇవే

వివాహానికి యోగ్యమైన ముహూర్తాలను పండితులు సూచిస్తున్నారు. మాఘ మాసం ప్రారంభం తదుపరి ఈనెల 13వ తేదీ, 14, 17, 18, 24, 28, 29 తేదీల్లో పలు ముహూర్తాలు ఉన్నట్లు పండితులు చెబుతున్నారు. వచ్చే నెల 2, 3వ తేదీల్లో సైతం వివాహాలు జరిపించుకునే అవకాశాలున్నాయంటున్నారు. పాల్గుణ మాసం మార్చి 15వ తేదీన, 17, 20, 22, 24, 25, 27, 28, 30 ఏప్రిల్‌లో 3, 4 తేదీలు వివాహ ముహూర్తాలున్నాయని అంటున్నారు. దీంతో పాటు చైత్ర మాసమైన ఏప్రిల్‌లో 9వ తేదీ, 18, 19, 20, 21, 22, 24, 26 తేదీల్లో వివాహాలు జరిగే అవకాశాలున్నాయని పండిత వర్గాలు అంటున్నాయి. ఏప్రిల్ 28వ తేదీ నుంచి మూఢం ప్రారంభం కానుంది. తిరిగి శ్రావణ మాసం వరకు అంటే ఆగస్టు వరకు వివాహ ముహూర్తాలు లేవని పురోహితులు వివరిస్తున్నారు.

పంక్షన్ హాళ్లు..క్యాటరింగ్ ముందస్తు బుకింగ్‌లు...

జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో పెళ్లిళ్ల జరగనుండడంతో తల్లిదండ్రులు ముందస్తు పనులపై దృష్టి సారించారు. పంక్షన్ హాళ్ల, క్యాటరింగ్, పురోహితులు, భాజా భజంత్రీలు, ఆర్కెస్ట్రా, డెకరేషన్, ఫొటో గ్రఫీ, వీడియో గ్రఫీ, ప్రీ వెడ్డింగ్ షూట్ స్టుడియోలు ఇలా పెళ్లికి అవసరమైన వాటిని ముందస్తుగా బుక్ చేసుకోవడంపై దృష్టి సారించారు. వివాహాలకు అవసరమైన పట్టు వస్త్రాలు, దుస్తులు, బంగారు ఆభరణాలు ముందస్తు కొను గోలు చేస్తున్నారు. అలాగే ముందస్తుగానే ఫంక్షన్ హాళ్ల, కమ్యూనిటీ హాళ్ల బుక్ చేసుకోవడం పై దృష్టి సారించారు.

ఊపందుకోనున్న వ్యాపారాలు..

పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కానుండడంతో జిల్లాలోని ప్రధాన పట్టణాలల్లో పలు వ్యాపారాలు జోరుగా సాగనున్నాయి. షాపింగ్ మాల్స్, బట్టల దుకాణాలు, డ్రెస్సెస్, జ్యూవెల్లరీ దుకాణాలు, లేడీస్ ఎంపోరియంలు, ఫొటో స్టుడియోలు, వీడియో గ్రాఫీ సెంటర్లు, ప్రీ వెడ్డింగ్ షూట్ స్టూడియోలు, ఫంక్షన్ హాల్స్ క్యాటరింగ్ కేంద్రాలు, ఫ్లవర్ డెకరేటర్స్, వంట మాస్టర్స్ ఇలా పలు వ్యాపారాలు పుంజుకోనున్నాయి. ఇప్పటికే ఇందుకు అవసరమైన ఏర్పాట్లను వ్యాపారాల నిర్వాహకులు చేసుకున్నారు. ప్రధానంగా జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లిలో బంగారం, వస్త్ర వ్యాపారం ఎక్కువగా ఉంటుంది. దేశంలో వివిధ ప్రాంతాల నుంచి నూతన డిజైన్లతో కూడిన వస్త్రాలను వ్యాపారులు తీసుకవచ్చి తమ దుకాణాల్లో విక్రయానికి సిద్ధంగా ఉంచారు. వినియోగదారులను ఆకర్షించడానికి డిస్కౌంట్‌లు, ఇతర బహుమతులను అందించడానికి ప్రయత్నిస్తున్నారు. వివాహాల సీజన్‌లో జిల్లా మొత్తంగా రోజుకు రూ. కోటి నుంచి రూ. మూడు కోట్ల వరకు వ్యాపార లావాదేవీలు జరుగుతాయని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి

డీఈవోకు టీఆర్‌టీఎఫ్ బాధ్యుల వినతి



డీఈవోకు వినతిపత్రం సమర్పిస్తున్న సభ్యులు

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 6: జిల్లాలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టీఆర్టీఎఫ్ ఉపాధ్యాయ సంఘ జిల్లా శాఖ అధ్యక్షుడు తుంగూరి సురేష్, ప్రధాన కార్యదర్శి గుర్రం శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం డీఈవో జగన్మోహన్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్వీసు రెగ్యులరైజేషన్ సర్టిఫికెట్ పరిశీలన ప్రక్రియ చేపట్టి, సర్వీస్ రెగ్యులేషన్ ఉత్తర్వులు అందించాలని, ఎస్సెస్సీ 2023 మూల్యాంకన విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్, టీఏ, డీఏలు చెల్లించాలని, ఎస్సెస్సీ మే 2022 పరీక్ష విధులలో పాల్గొన్న ప్రధా నోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు.

బాల్క సుమన్ క్షమాపణలు చెప్పాలి

టీపీసీసీ సభ్యుడు సంగనభట్ల దినేష్



ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న దినేష్

ధర్మపురి, ఫిబ్రవరి 6: సీఎం రేవంత్‌రెడ్డి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్ డిమాండ్ చేశారు. ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి పట్ల అసభ్య పదజాలంతో వ్యాఖ్యలు చేయడం ఆయన స్థాయికి తగదన్నారు. రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో కేసీఆర్ మెప్పు పొంది పోటీ చేసేందుకు ఈ వ్యాఖ్యలు అన్నారు. ఎంపీగా పోటీ చేసినా సుమన్‌కు ఓటమి తప్పదన్నారు. పద్ధతి మార్చుకోకుంటే ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు సింహరాజు ప్రసాద్, మండల అధ్యక్షులు రాందేని మొగిలి, మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండీ రఫియొద్దీన్, పట్టణ అధ్యక్షులు తిరుపతి, పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి



ప్రశాంసా పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యం

మల్యాల, ఫిబ్రవరి 6: విద్యార్థులు నిర్దిష్ట లక్ష్యం ఏర్పరచుకొని దాని సాధనకు కృషి చేసి ఉన్నతంగా ఎదగాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. తాటిపల్లి బాలికల గురుకుల కళాశాలలో మంగళవారం రాత్రి ఇంటర్ విద్యార్థుల ఫెర్‌వెల్ కార్యక్రమం నిర్వహించగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో మెరుగైన వసతుల కల్పనకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దొంగ అనిత, ప్రిన్సిపాల్ పత్తెం శ్రీనివాస్ కళాశాల అధ్యాపకులతో పాటు నాయకులు ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ముత్యం శంకర్, సతీష్‌రెడ్డి, లక్ష్మణాచారి, పాల్గొన్నారు. ఈ వేడుకలో విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అవినీతి అధికారులపై సీఎస్‌కు ఫిర్యాదు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 6: అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న జిల్లా సివిల్ సప్లై అధికారులపై చర్యలు తీసుకో వాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి మంగళవారం సెక్రటేరియట్‌లో తిమ్మాపూర్ మాజీ ఉప సర్పంచ్ సల్లా సునీల్ ఫిర్యాదు చేశారు. శ్రీ వెంకట లక్ష్మీ నరసింహ ఇండస్ట్రీస్ రైస్‌మిల్‌కు అడ్డదారిలో ధాన్యం కె టాయించి అక్రమాలకు పాల్పడిన డీసీఎస్‌ఓ వెంకటేశ్వర్‌రావుపై, డీటీ ఉమాపతిలు అవినీతికి పాల్పడి ధాన్యం కెటాయించారని వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 6: జాతీయ స్థాయి క్రీడా పోటీలకు జిల్లా నుంచి బాలిక ఎంపికైనట్లు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకు ఒడిస్సాలో జరుగుతున్న జూనియర్ జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలలో పాల్గొంటున్న తెలంగాణ బాలికల జట్టుకు జగిత్యాలకు చెందిన క్రీడాకారిణి కారుణ్య ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారిణి కారుణ్యను పీఈటీలు విశ్వప్రసాద్, నిరంజన్ కుమార్, రవికుమార్, కృష్ణప్రసాద్, అజయ్‌బాబు, విద్యాసాగర్ అభినందించారు.

దుబ్బ రాజన్న ఆలయంలో వేలంపాట

సారంగాపూర్, ఫిబ్రవరి, 6: శ్రీ దుబ్బ రాజన్న ఆలయంలో నేడు వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో తెలిపారు. టెంకాయ, బెల్లము, పూజ సామగ్రి, లడ్డు పులిహోర, పూల దండలు, పండ్లు, ఆట బొమ్మలు, గాజులు, పాద రక్షలు అమ్ముకునుటకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈ వేలం పాట ఉదయం 11 గంటలకు వేలం పాటలో పాల్గొనే వారు భజరు కాగలరని ఆలయ అధికారులు ఇక ప్రకటనలో పేర్కొన్నారు.

మూడు నెలల్లో లబ్ధిదారులకు ఇళ్లు కేటాయిస్తాం

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయాన్ని పరిశీలిస్తున్న జీవన్ రెడ్డి

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 6 : డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయంలో అన్ని మౌలిక వసతులు కల్పిస్తూ మూడు నెలల్లో లబ్ధిదారులను గృహ ప్రవేశం చేపించే బాధ్యత తీసుకుంటానని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పేర్కొన్నారు. జగిత్యాల అర్బన్ హౌసింగ్ కాలనీలో మంగళవారం అధికారులతో కలిసి ఎమ్మెల్సీ పర్యటించారు. లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. హౌసింగ్ కాలనీలో అన్ని మతాల ప్రజలకు ప్రార్ధనా మందిరాలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఉగాది నాటికి హౌసింగ్ కాలనీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటానన్నారు. 2009లో ఇల్లులేని నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు 111 ఎకరాల భూమి సేకరించి ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం కింద 4 వేల ఇళ్ల నిర్మాణానికి పునాది వేసింది తానేనని గుర్తు చేశారు. గత ప్రభుత్వం తాగు నీరు, మురికి కాలువల నిర్మాణం, విద్యుత్ సౌకర్యం కల్పించాల్సి ఉన్నా పట్టించుకోలేదన్నారు. కేవలం ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు ఆదర బాదరగా డబుల్ బెడ్‌రూం ఇళ్లలో మౌలిక వసతులు కల్పించకుండానే ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారన్నారు. తాను ఓడిపోయినప్పటికి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో ప్రజల సమస్యలు పరిష్కరించే అవకాశం లభించిందన్నారు. రూ. 25 కోట్ల నిధులతో అధికారులు అంచనాలు రూపొందిస్తున్నారని పనులు కూడా త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. గతంలో వివిధ దశల్లో నిలిచిపోయిన 1600 ఇళ్ల నిర్మాణాలు కూడా పూర్తి చేసేలా తన వంతుగా కృషి చేస్తానన్నారు. ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి నిర్మాణం కోసం రూ. 5 లక్షలు ఇప్పించే బాధ్యత తీసుకుంటానని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు ఉన్నారు.

జిల్లా కేంద్రంలో భరోసా కేంద్రం ఏర్పాటు

వర్చువల్ పద్ధతిలో ప్రారంభించిన డీజీపీ రవి గుప్తా



భరోసా కేంద్రంలో పోలీస్ అధికారులతో ఎస్పీ

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 6 : మహిళా భద్రతే లక్ష్యంగా జిల్లా కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భరోసా కేంద్రం ఏర్పాటు చేయగా వర్చ్యువల్ పద్ధతిలో వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రధాన కార్యాలయం నుంచి రాష్ట్ర డీజీపీ రవి గుప్తా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ మహిళా భద్రతకు భరోసానిస్తూ, బాధిత మహిళలను, పిల్లలను అక్కున చేర్చుకుని కొండంత ధైర్యాన్నిచ్చేందుకే భరోసా సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. భరోసా సెంటర్ ద్వారా వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన పోక్సో అత్యాచార కేసుల్లో కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు బాధిత మహిళలకు వసతి కల్పిస్తామన్నారు. పోలీస్ స్టేషన్లో కేసు నమోదు మొదలుకుని చివరి వరకు అన్ని తానై వెన్నంటి ఉంటూ మహిళలకు అండగా నిలుస్తుందన్నారు. మహిళలు, పిల్లలపై జరిగే నేరాలను, హింసను తగ్గించడమే ప్రధాన లక్ష్యంగా భరోసా కేంద్రం పని చేస్తుందని వివరించారు. మహిళలు, యువతులు, బాలికలు అన్యాయానికి గురైనపుడు బయపడకుండా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ వివరించారు. అంతేకాకుంగా భరోసా కేంద్రంలో మెడికల్, న్యాయ సలహా, వైద్యం, కౌన్సిలింగ్, సైకలాజిస్ట్ ఇలా అన్ని సౌకర్యాలు ఒకే చోట కల్పించేటా రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ భీమ్ రావు, డీఎస్పీ వెంకటస్వామి, సీసీఎస్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, నాగేశ్వర్ రావు, ఆర్‌ఐ జానిమియా ఉన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన

మల్యాల, ఫిబ్రవరి 6: సామాజిక అంశాలు మూఢ నమ్మకాలు, ఆత్మహత్యల నివారణ, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలు, గల్ఫ్ ఏజంట్‌ల మోసాలు, సైబర్ నేరాలు, సీసీ కెమెరాల అవశ్యకతపై మల్యాల మండల కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం సీఐ దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ నేను సైతం కార్యక్రమం ద్వారా అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఏమైన సమస్యలు ఇతరాత్ర ఉంటే ప్రజలు డయల్ 100కు సమాచారం అందించాలని అన్నారు. ఈ సందర్భంగా సామాజిక అంశాలపై పోలీస్ కళాబృందం ద్వారా ప్రజలకు వివరించారు. ఎస్సై కుమారస్వామి, పోలీసులు పాల్గొన్నారు

దేవస్థానానికి రూ.19.53లక్షల ఆదాయం

మల్యాల, ఫిబ్రవరి 6: కొండగట్టు అంజన్న దేవస్థానంకు మంగళవారం రూ.19.53లక్షల ఆదాయం వచ్చింది. లడ్డూ, పులిహోర, శీఘ్ర, ప్రత్యేక దర్శన టికెట్ల ద్వారా ఈ ఆదాయం సబకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇందులో లడ్డూ, పులిహోర ప్రసాదాల ద్వారా రూ.10లక్షలు రాగ వాటిని కూడా ఆదాయంగా పేర్కొనడం గమనార్హం.

రాయికల్‌లో వ్యక్తి అదృశ్యం

రాయికల్, ఫిబ్రవరి 6: రాయికల్ పట్టణానికి చెందిన దాసరి చిన్న నర్సయ్య (70) అనే వ్యక్తి అదృశ్యమైనట్లు రాయికల్ ఎస్సై అజయ్ తెలిపారు. నర్సయ్య జ్ఞాపక శక్తి కోల్పోయి ఇంట్లో నుంచి ఈ నెల 4న ఉదయం వెళ్లిపోయాడని, ఇప్పటివరకు ఇంటిరి తిరిగి రాలేదని అతని భార్య దాసరి లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆచూకీ తెలిసినవారు రాయికల్ పోలీస్‌స్టేష న్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై తెలిపారు.

దేశ భద్రతను సుస్థిరం చేసిన ఘనత మోదీదే

బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి కుమార్



కమలాపూర్ గ్రామంలో మాట్లాడుతున్న సోగాల కుమార్

ధర్మపురి, ఫిబ్రవరి 6: దేశ భద్రతను సుస్థిరం చేసిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీకే దక్కిందని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి సోగాల కుమార్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తు న్న దృష్ట్యా బీజేపీ కేంద్ర పార్టీ దేశవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న గావ్ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా ధర్మపురి మండలంలోని కమలాపూర్ గ్రామంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారసత్వ రాజకీయాలతో దేశభద్రతను ఫణంగా పెట్టిన కాంగ్రెస్ పార్టీని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కేంద్ర ప్రభుత్వం సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ నినాదంతో పేదల సంక్షేమం దేశ అంతర్గత భద్రత, మహిళా సాధికారత కోసం కృషి చేస్తుందన్నారు. అనంతరం గ్రామంలో బూత్ లెవల్ పరిధిలో రైతులు, యువకులను కలిసి కేంద్ర ప్రభుత్వ పథకాలనా ఆయన వివరించారు. దళితవాడలో పర్యటించి పేద కుటుంబంతో కలిసి ఆయన భోజనం చేశారు. పార్టీ ఎజెండా ప్రకారం రైతులు, నక్సల్స్, బాధిత కుటుంబాలు, పాఠశాల, పోస్టు ఆఫీస్, పోలింగ్ బూత్ కమిటీలతో ఆయన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కస్తూరి సత్యం, కో కన్వీనర్ బండారి లక్ష్మణ్, స్వచ్ఛ భారత్ రాష్ట్ర కన్వీనర్ మంచె రాజేష్, మండల అధ్యక్షులు సంగెపు గంగారాం, దళిత మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి చంద్రశేఖర్, మండల ప్రధాన కార్యదర్శి కుమ్మరి తిరుపతి, ఓబీసీ జిల్లా మోర్చా కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, నాయకులు సట్టంశెట్టి సత్తయ్య, కుమ్మరి రవి, పాకాల సాయికిరణ్, ము డారి రాములు పాల్గొన్నారు.

బూత్ పరిధిలో ఇంటింటా ప్రచారం

గావ్ చలో కార్యక్రమంలో భాగంగా బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో 33వ బూత్ పరిధిలో మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను కరపత్రాల రూపంలో ప్రజలకు పంపిణీ చేశారు. పీఎం కిసాన్, మహిళలకు ఉజ్వల పథకం, జాతీయ రహదారులు, వందే భారత్ రైళ్లు, సమ్మక్క-సారలమ్మ గిరిజన విశ్వవిద్యాలయం, ఏయిమ్స్ ఏర్పాటు, ఇతరత్రా కార్యక్రమాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ధర్మపురి అసెంబ్లీ కన్వీనర్ కస్తూరి సత్యం, పట్టణ అధ్యక్షులు బెజ్జారపు లవణ్, బీజేవైఎం పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, పల్లెర్ల సురేందర్, తిరుమన్‌దాసు సత్యనారాయణ, నారవేణి మూర్తి, కాశెట్టి హరీష్, మండలోజు సూరజ్, ఆనందాసు నవీన్, శ్యాంరావు నాగులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు

● 135 గ్రాముల బంగారం, నగదు స్వాధీనం

పెద్దపల్లిటౌన్, జనవరి 6: జల్సాలకు అలవాటుపడి సులవుగా డబ్బులు సంపాదించాలనే ఇద్దరు దొంగల ముఠాను మంగళవారం పెద్దపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందవర్భంగా ఏసీపీ ఎడ్ల మహేష్ వివరాలు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా కుకుతుబుల్లాపూర్, భగత్ నగర్‌కు చెందిన మనిగండ్ల విజయ్‌కుమార్, భూపాల్‌పల్లి జిల్లా మొట్లపల్లికి చెందిన మిర్యాల రాజులు గతంలో దొంగతనాలకు పాల్పడి జైలు జీవితంలో పరిచయమయ్యారు. వీరిద్దరూ జనవరి 31న పెద్దపల్లి పట్టణంలోని టీచర్స్ కాలనీలో తమ వెంట తెచ్చుకున్న రించ్ స్పానర్‌తో ఓ ఇంటి తాళం పగులగొట్టి చొరబడగా ఆ ఇంటిలో ఖరీదైన వస్తువులు దొరకకపోవడంతో పక్కనే ఉన్న ఎరవెల్లి వెణుగోపాల్‌రావు ఇంటి తాళం పగుల గొట్టి బంగారు, వెండి అభరణాలు దొరికినకాడికి దోచుకొని పారిపోయారు. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో దొంగల ఆచూకీ సేకరించారు. మంగళవారం పెద్దపల్లి బస్టాండ్ ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుకున్నారు. తమదైన శైలిలో విచారణ చేపట్టారు. చేసిన దొంగతనాన్ని ఒప్పుకున్న దొంగల నుంచి 135 గ్రాముల బంగారం, లక్షా 40 వేల రూపాయల నగదు, మూడు సెల్ ఫోన్లు, ఒక బైక్, బంగారు అభరణాల లోన్ పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని కోర్టులో హాజరు పర్చనున్నట్లు ఏసీపీ తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ ఆర్ కృష్ణ, పెద్దపల్లి, ధార్మరం, బసంత్ నగర్ ఎస్సైలు మల్లేష్, సత్యనారాయణ, వెంకటేష్‌లతో పాటు సిబ్బందిని అభినందించారు.

నాలుగు ఇళ్లలో చోరీ

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 6: తంగళ్లపల్లి మండలంలో నాలుగిళ్లల్లో చోరీ జరిగింది. బాధితుల కథనం ప్రకారం..గుర్తు తెలియని దుండగులు సోమవారం రాత్రి నాలుగు ఇళ్ల తాళాలు పగులగొట్టి రూ. 1.50 లక్షల నగదు, ఐదున్నర తులాల బంగారం, కిలో వెండి అభరణాలు ఎత్తుకెళ్లారు. తాళం వేసి ఉన్న ఇళ్లనే టార్గెట్ చేసుకుని తంగళ్లపల్లికి చెందిన కడమంచి లింగమూర్తి ఇంటి తాళం పగులగోట్టి 40 వేల నగదు, నాలుగు తులాల బంగారం ఎత్తుకెళ్లారు. అలాగే మ్యాకల గంగారాం ఇంటి తాళాలు పగులగోట్టి బీరువాలో ఉన్న రూ. 60వేల నగదును దోచుకున్నారు. పక్కనే ఉన్నా మ్యాకల నర్సయ్య ఇంటి తాళాన్ని పగులగొట్టి వస్తువులను చిందరవందరగా చేశారు. అలాగే పద్మనగర్‌కు చెందిన పురోహితుడు పారునంది అంజనేయ శర్మ దంపతులు ఇంటికి తాళం వేసి ఊరువెళ్లగా తాళాలు పగులగొట్టిన దొంగలు రూ 50 వేల నగదు, తులం బంగారంతో పాటు కిలో వెండి అభరణాలను అపహరించినట్లు తెలిపారు. 48 గంటల్లో ఓబులాపూర్ గ్రామంతో పాటు తంగళ్లపల్లి, పద్మనగర్‌లలో ఏడు ఇళ్ల తాళాలు పగులగొట్టి దొంగతనాలు జరగడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. సీరియస్‌గా తీసుకున్న పోలీసులు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌ను రప్పించి దొంగల అచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు. చోరీ జరిగిన ఇళ్లను సీఐ సదన్‌కుమార్, ఎస్ఐ ప్రశాంత్‌లు పరిశీలించారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

గంగాధర, ఫిబ్రవరి 6: మాయమాటలు చెప్పి ప్రయాణికురాలి రెండు తులాల బంగారు పుస్తెల తాడును దొంగిలించిన నిందితులను పట్టుకున్నట్లు చొప్పదండి సీఐ రవీందర్ తెలిపారు. మంగళవారం గంగాధర పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కొడిమ్యాల మండలం నాచుపల్లికి చెందిన వృద్ధురాలు లక్ష్మి(60) గంగాధర మండలం గర్శకుర్తిలోని కూతురు ఇంటికి కొడిమ్యాల మండలం జేఎన్‌టీయూ రోడ్డు వద్ద ఆటో ఎక్కి వస్తుండగా ఆటో డ్రైవర్ రాజు, అతని భార్య పద్మావతి మాయమాటలతో పుస్తెలతాడు దొంగిలించినట్లు తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని 48 గంటల్లో నిందితులను గుర్తించి అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. నేరస్తులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన గంగాధర ఎస్‌ఐ అభిలాష్, సిబ్బందిని అభినందించారు. నిందితుల నుంచి రెండు తులాల బంగారు ఆభరణాలను రికవరీ చేసినట్లు తెలిపారు.

ఆటో కిందపడి చిన్నారి మృతి

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 6: కొత్తపల్లి మండలం చింతకుంటలో మంగళవారం ఉదయం ఒక ఆటో కిందపడి 16 నెలల చిన్నారి మృతి చెందిందని కొత్తపల్లి ఏఎస్‌ఐ మొగిలి పోచయ్య తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లికి చెందిన వేముల నూతనశ్రీ అనే చిన్నారిపై నుంచి ఆటో టైర్ ఎక్కటంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందిందని తెలిపారు. ఇంటర్‌నెట్ కేబుల్ లైన్ తవ్వేందుకు వచ్చిన కూలీలు చింతకుంటలో పనిచేస్తున్నారు. నీటిని సరఫరా చేస్తున్న అంజయ్యకు తన ఆటోను రివర్స్ తీస్తుండగా అక్కడే నూతనశ్రీ తన తల్లితో కలిసి ఉంది. ప్రమాదవశాత్తుగా ఆటోను చిన్నారిపై నుంచి తీయటంతో దుర్మరణం చెందిందని తెలిపారు. మృతురాలి తండ్రి ఆనంద్ ఫిర్యాదుతో చింతకుంటకు చెందిన ఆటో డ్రైవర్ అంజయ్యపై ఫిర్యాదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ మొగిలి పోచయ్య తెలిపారు.

మహాశివరాత్రి జాతరకు విస్తృత ఏర్పాట్లు చేయాలి

● రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, ఫిబ్రవరి 6: మహాశివరాత్రి జాతర కోసం విస్తృతస్థాయిలో ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వచ్చే నెల 7, 8, 9వ తేదీల్లో వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి దేవస్థానంలో నిర్వహించనున్న మహాశివరాత్రి జాతర ఏర్పాట్లపై మంగళవారం ఆలయ ఓపెన్ స్లాబ్ ప్రాంగణంలో కలెక్టర్ అనురాగ్ జయంతి అధ్యక్షతన జాతర సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఉత్సవాలను ఎలాంటి ఇబ్బంది లేకుండా నిర్వహించేందుకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని దిశానిర్దేశం చేశారు. శివ స్వాములకు సులభ దర్శనం జరిగే విధంగా చూడాలని, దర్శన సమయం కూడా అరగంట అదనంగా పెంచాలన్నారు. పుర ప్రముఖులకు గతంలో మాదిరి బ్యాడ్జీలు అందజేసి సులభ దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రస్తుతం భక్తుల కోసం రెండు క్యూలైన్‌ల సిస్టం ఉన్న దృష్ట్యా వీఐపీల కోసం మూడో క్యూలైన్ శివరాత్రి లోగా ఏర్పాటు చేయాలని అన్నారు. బద్ది పోచమ్మ ఆలయం వద్ద భక్తులకు తాగునీరు, కుర్చీలు, పందిల్ల సౌకర్యం కల్పించాలని చెప్పారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉన్న దృష్ట్యా భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక బస్సుల సంఖ్యను పెంచాలన్నారు. బస్టాండ్‌లో మూత్రశాలలు, తాగునీరుకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. పారిశుధ్య సిబ్బందిని నియమించాలన్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు శాశ్వత సీసీ కెమెరాలను పెట్టాలన్నారు. జాతర విజయవంతం చేయాలని కోరారు.



ఆలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న విప్ ఆదిశ్రీనివాస్

అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి


మహా శివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్, జాతర సమన్వయ కమిటీ చైర్మన్ అనురాగ్ జయంతి సూచించారు. భక్తులు స్వామి వారి దర్శనాన్ని వేగంగా, సౌకర్యంగా చేసుకునేలా ఏర్పాట్లు ముమ్మరంగా చేయాలని వివరించారు.

జాతరకు భారీ బందోబస్తు : ఎస్పీ అఖిల్ మహాజన్

మహా శివరాత్రి జాతర సందర్భంగా యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జాతర సందర్భంగా ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. వేములవాడలో కావాల్సిన సైన్ బోర్డ్, టోయింగ్ వాహనం, క్రేన్ అందుబాటులో ఉంచాలని ఆలయ ఈవోకు సూచించారు. ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా వలంటీర్‌లను ఏర్పాటు చేయాలని అన్నారు. సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, ట్రైనీ ఐపీఎస్ రాహుల్ రెడ్డి, ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్, వేములవాడ ఆర్డీవో మధుసూదన్, డీఎస్పీ నాగేంద్రచారి, తహసీల్దార్ మహేష్ ఉన్నారు.

వీఐపీ క్యూలైన్ కోసం ఏర్పాట్ల పరిశీలన

వేములవాడ : వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో వీఐపీ క్యూలైన్ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ అనురాగ్ జయంతి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న సమయంలో మూడో క్యూలైన్ ఉపయోగించడం వల్ల సామాన్య భక్తులకు స్వామివారి దర్శనం త్వరగా లభించే అవకాశం ఉందని, ఇదే క్యూలైన్‌ను వీఐపీల బ్రేక్ దర్శనం కోసం నిర్దిష్ట సమయాల్లో ఉపయోగించవచ్చని ఆది శ్రీనివాస్ సూచించారు. ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్‌తో పాటు ఇంజనీరింగ్ అధికారులకు వారు సూచించారు.



యువకుడి ఆత్మహత్య

మల్యాల, ఫిబ్రవరి 6: కొండగట్టుకు చెందిన ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నవేని(బండల్ల) అజయ్(18)అనే యువకుడు మంగళవారం తాను అద్దెకు ఉంటున్న ఇంట్లో ఉరి వేసుకున్నాడు. కొందరు గమనించి 108కు సమాచారం అందించడంతో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే అజయ్‌ను ఆసుపత్రికి తరలిస్తుండగానే మార్గమధ్యలో మృతి చెందాడు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు.



రాజన్న క్షేత్రంలో తిరుమల తరహా వీఐపీ బ్రేక్

● ఉదయం, సాయంత్రం గంట చొప్పున దర్శనం

వేములవాడ, ఫిబ్రవరి 6: తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో అమలు చేస్తున్న తరహాలో వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలోనూ వీఐపీ బ్రేక్ దర్శనం సౌకర్యం కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ సూచించారు. మంగళవారం ఆలయ ఓపెన్ స్లాబ్ ప్రాంగణంలో కలెక్టర్ అధ్యక్షతన జరిగిన మహాశివరాత్రి జాతర సమన్వయ కమిటీ సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడారు. వీఐపీల రాక కారణంగా సామాన్య భక్తులకు దర్శనం నిలిపివేయడం వల్ల అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. ఈ పరిస్థితిని నివారించడానికి టీటీడీ తరహాలో వీఐపీ బ్రేక్ దర్శన విధానాన్ని ప్రవేశ పెట్టాలని ఆలయ అధికారులకు సూచించారు. ఉదయం వేళలో ఒక గంట, సాయంత్రం వేళలో ఒక గంట సమయం వీఐపీ బ్రేక్ దర్శనం కోసం కేటాయించాలని, ఇందుకోసం ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేయాలని సూచించారు. వీఐపీ బ్రేక్ దర్శనానికి సంబంధించిన సాధ్యాసాధ్యాలపై క్షేత్రస్థాయి అధ్యయనం చేసి వీలైతే శివరాత్రి జాతరలోగానే ఇందు కోసం తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. వీఐపీ బ్రేక్ దర్శనం కోసం ప్రత్యేక సమయం కేటాయించడం వల్ల సాధారణ భక్తులకు దర్శన ఇబ్బందులను దూరం చేయవచ్చని ఆది శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు.

బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ, ఫిబ్రవరి 6: రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. మేడారం సమ్మక్క సారక్క జాతరకు వెళ్లడానికి ముందు ఆనవాయితీ ప్రకారం సోమవారం తమ ఇష్టదైవమైన రాజరాజేశ్వరస్వామి వారిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు మంగళవారం బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు తెల్లవారుజామునే భక్తిశ్రద్ధలతో నైవేద్యం వండి బోనం తయారుచేసి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకొని బద్దిపోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం చెల్లించేందుకు భారీ సంఖ్యలో జనం తరలిరావడంతో క్యూలైన్లు కిక్కిరిసి పోయాయి. అమ్మవారి దర్శనానికి సుమారు రెండు గంటలకు పైగా సమయం పట్టింది.

సమ్మక్క భక్తులతో కిక్కిరిసిన అంజన్న క్షేత్రం




ఆలయం వద్ద భక్తుల రద్దీ



కొండపైన భక్తుల వాహనాలు

మల్యాల, ఫిబ్రవరి 6: కొండగట్టు అంజన్న క్షేత్రం మంగళవారం భక్తులతో పోటెత్తింది. వేలాదిగా తరలి వచ్చిన సమ్మక్క, సారక్క భక్తులతో జనసంద్రంగా మారింది. మేడారంలో జరిగే సమ్మక్క, సారక్క జాతర నేపథ్యంలో కొండగట్టు అంజన్నకు తొలి మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు కొండగట్టుకు తరలి వస్తున్నారు. దాదాపుగా యాభై వేలకు వరకు భక్తులు అంజన్నను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం రాత్రికే కొండపైకి చేరుకున్న భక్తులు వేకు వజాము నుంచే స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. ఆలయానికి వచ్చే మార్గాలు, కోనేరు పరిసరాలు భక్తులతో నిండిపోయాయి. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో వెంకటేష్, ఏఈవో వైరా గ్యం అంజయ్య, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, పోలీసులు ఇతర అధికారులు పర్యవేక్షించారు. వందలాది వాహ నాలతో ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గం నిండిపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.







భూ కబ్జా కేసులో మరొకరి అరెస్టు

● సీపీ కఠిన చర్యలతో కబ్జాదారుల్లో భయం

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 6: భూకబ్జా కేసులో మంగళవారం కరీంనగర్ పోలీసులు మాజీ ఆర్టీఏ మెంబర్ తోట శ్రీపతిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. కరీంనగర్ శివారులోని వివేకానందపురి కాలనీకి చెందిన అనుమాండ్ల రవీందర్ 2014 మేలో తీగలగుట్టపల్లి రోడ్ నెంబరు 16 కార్తికేయనగర్‌లో 144 చదరపు గజాల ఇంటి స్థలం కొనుగోలు చేసి బేస్‌మెట్ నిర్మించుకుని 2023లో ఒక బోర్‌వెల్ కూడా వేసుకున్నాడు. ఇటీవలనే ఇంటి నిర్మాణం చేపడుతుండగా జనవరి 10న రాత్రి 10:30 గంటలకు పది మందికిపైగా అక్రమంగా చొరబడి 8 పిల్లర్లు, ఇతర నిర్మాణాలను కూల్చివేశారని బాధితుడు కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ విచారణ జరిపి ఈ ఘటనతో ప్రమేయం ఉన్న కరీంనగర్ చైతన్యపురి కాలనీకి చెందిన తోట శ్రీపతిరావు(50), పొన్నాల కనకయ్య, పవన్, సిరిపురం వెంకటరాజు, మరి కొందరిపై పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. అయితే కేసు నమోదైన విషయం తెలుసుకున్న శ్రీపతిరావు పరారీలో ఉండగా అతని గాలింపుకు ప్రత్యేకంగా ఒక టీంను ఏర్పాటు చేసి వెదుకుతుండగా సోమవారం అర్ధరాత్రి హైదరాబాద్ అబర్‌పేట్‌లో అతని సోదరుడి ఇంటిలో ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేశారు. మంగళవారం ఉదయం కరీంనగర్‌కు తీసుకువచ్చి విచారణ అనంతరం సాయంత్రం శ్రీపతిరావును కరీంనగర్ అడిషనల్ ఫస్ట్‌క్లాస్ జుడీషియల్ కోర్టులో హాజరుపరిచారు. శ్రీపతిరావుకు 14 రోజుల రిమాండ్ విధిస్తూ జడ్జి ఆదేశాలు జారీ చేయగా పోలీసులు జైలుకు తరలించారు.

● భూకబ్జాలు, దౌర్జన్యాలు, డబ్బులు డిమాండ్, వేధింపులకు సంబంధించి బాధితుల ఫిర్యాదులతో నిందితులపై వరుసగా కేసులు నమోదు చేస్తూ, అరెస్టు చేసి జైలుకు తరలిస్తూ కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి కఠిన చర్యలు తీసుకుంటున్నారు. నెల రోజులుగా భూకబ్జాలు, మోసాలపై పోలీస్ కమిషనర్ దర్బార్‌ను నిర్వహిస్తుండగా ఇప్పటి వరకు 660 మంది బాధితుల నుంచి సీపీకి ఫిర్యాదులు అందాయి.

కేసుల భయంతో 8 ప్లాట్లు అప్పగింత

ఇటీవల పోలీస్ కమిషనర్ భూకబ్జాలపై ఉక్కుపాదం మోపి కేసులు, అరెస్టులు చేస్తుండటంతో భయపడి కరీంనగర్ మూడో ఠాణా పరిధిలోని ఒక ప్రజాప్రతినిధి గతంలో కబ్జా చేసిన స్థలాలను బాధితులను పిలిపించుకుని తిరిగి వారికి అప్పగించనట్లు తెలిసింది. అప్పటి అధికారపార్టీకి చెందిన సదరు ప్రజాప్రతినిధి భూ వివాదంలో తలదూర్చి న్యాయం చేస్తానని చెప్పి చివరకు ఆ స్థలంలో ప్రహరీగోడను నిర్మించి తన ఆధీనంలో పెట్టుకున్నాడని, ఆ తరువాత ఇంటినెంబర్లు వేసి, షెడ్ కూడా నిర్మించినట్లు తెలిసింది. బాధితులు సీపీని ఆశ్రయించేందుకు ప్రయత్నిస్తుండగా విషయం తెలుసుకుని బాధితులను పిలిపించుకుని వారి స్థలాలను వారికే అప్పగించినట్లు సమాచారం. దీనిపై కూడా స్పెషల్‌టీం పోలీసులు ఆరాతీస్తున్నట్లు తెలిసింది. వ్యక్తిగత ఆర్థిక లావాదేవీలు, భూ వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులు కూడా వెల్లువెత్తుతుండటంతో ఆయా పరిధిలోని పోలీసు ఠాణాల ఎస్‌హెచ్‌ఓలకు అప్పగించి విచారణ జరపాలని సీపీ ఆదేశిస్తున్నారు. భూకబ్జాలు, డబ్బులు మోసాలకు సంబంధించి పెద్ద తలకాయల పాత్ర ఉన్న కేసులను నేరుగా సీపీ మానిటరింగ్ చేస్తూ దర్యాప్తు అధికారులకు ఎప్పటికప్పుడు తగిన సూచనలు, ఆదేశాలు జారీ చేస్తూ కేసుల దర్యాప్తును పకడ్బందీగా నిర్వహిస్తున్నారు.

కుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 6: మండలంలోని అనంతగిరి గ్రామంలో కుక్క దాడిలో ముగ్గురికి గాయాలయ్యాయి. గ్రామస్థుల వివరాల ప్రకారం మంగళవారం ఇంటి బయట ఆడుకుంటున్న పబ్బతి మనోజ్ఞ, పబ్బతి ప్రసన్న, జుట్టు బాలయ్యలను కుక్క కరిచింది. చికిత్స నిమిత్త వీరిని ఆస్పత్రికి తరలించారు.

యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మధు

కొడిమ్యాల, ఫిబ్రవరి 6 : యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని పూడూర్ గ్రామానికి చెందిన కవ్వం మధును నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు గుండ మధుసూధన్ మంగళవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం నియామక పత్రాన్ని మధుకు అందించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మరింత అభివృద్ధి చెందటానికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, చొప్పదండి ఎమ్మెల్యే సత్యం, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివసేనారెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కడారి మల్లేశం, కాంగ్రెస్ పార్టీ నాయకులు నారాయణగౌడ్, జీవన్‌రెడ్డి, మల్లిఖార్జున్‌రెడ్డి, మహిపాల్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అయిలయ్య, మల్లేశంయాదవ్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

కేసీఆర్ కులవృత్తులకు జీవం పోశారు

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



చల్‌గల్ లో బోనం సమర్పిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్, ఫిబ్రవరి 6 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కులవృత్తులకు జీవం పోశారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామంలో నిర్వహించిన శ్రీ రేణుక ఎల్లమ్మ దేవిపట్నాలు, జాతర మహోత్సవానికి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో, పట్టణాల్లో గౌడసంఘం అభివృద్ధికి నిధులు మంజూరు చేశామని, గౌడ కులస్థుల సంక్షేమానికి కృషి చేశామని తెలిపారు. ఈకార్యక్రమంలో ప్యాక్స్ ఛైర్మన్ పత్తిరెడ్డిమహిపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ పద్మతిరుపతి, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు పూదరి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు, గౌడ సంఘంసభ్యులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

సిరికొండ విండో ఛైర్మన్‌గా జీవన్‌రెడ్డి



ఎన్నిక పత్రం అందిస్తున్న డీసీవో

కథలాపూర్, ఫిబ్రవరి 6 : మండలంలోని సిరికొండ సింగిల్ విండో ఛైర్మన్‌గా కందారి జీవన్‌రెడ్డి ఎన్నికయ్యారు. మంగళవారం జిల్లా సహకార అధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆసక్తి గల డైరెక్టర్ల నుంచి నామినేషన్లు స్వీకరించారు. గుంట మహేశ్, కందారి జీవన్‌రెడ్డి, కందారి కిషన్‌రెడ్డి నామినేషన్లు వేశారు. కందారి జీవన్‌రెడ్డికి 9 మంది డైరెక్టర్లు చేతుల ఎత్తడంతో మెజారిటీ సభ్యుల మద్దతు లభించింది. దీంతో ఎన్నిక పత్రాన్ని జీవన్‌రెడ్డికి డీసీవో అందజేశారు. ఈ సందర్భంగా డీసీవో సత్యనారాయణ మాట్లాడుతూ పాలకవర్గం రైతుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. బంగారంపై రుణాలు ఇచ్చి సొసైటీ అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వైస్ ఛైర్మన్ బత్తుల నరేశ్, డైరెక్టర్లు, సీఈవో రాంప్రసాద్ సిబ్బంది ఉన్నారు.

చురుకుగా సాగుతున్న రాజగోపురం పనులు



పెగడపల్లిలో నిర్మిస్తున్న రాజగోపురం

పెగడపల్లి, ఫిబ్రవరి 6 : మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో నిర్మిస్తున్న రాజగోపురం (గాలిగోపురం) నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్ రాజగోపురం నిర్మాణానికి గాను రూ. 50 లక్షలు మంజూరు చేయించి పనులు ప్రారంభించారు. మూడు నెలలుగా పనులు చురుగ్గా సాగుతున్నాయి. పనులు మహాశివరాత్రి జాతర ఉత్సవాలకు పూర్తి చేసేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తాజా మాజీ సర్పంచ్ మేరుగు శ్రీనివాస్ పేర్కొన్నారు. రాజగోపురం నిర్మాణంతో పెగడపల్లి రాజన్న ఆలయానికి కొత్త శోభ చేకూరనుండగా భక్తులు నిర్మాణ పనుల పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

మెట్‌పల్లి, ఫిబ్రవరి 6: పట్టణంలోని కాంగ్రెస్ నాయకులు, మహిళలు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, పార్టీ కోరుట్ల నియోజక వర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, రాష్ట్ర నాయకుడు కొమిరెడ్డి కరంచంద్‌ల చిత్రపటాలకు మంగళవారం మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మార్గం గంగాధర్ ఆధ్వర్యంలో మహిళలు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీల్లోని ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయగా మరో రెండు పథకాలు 200 యూనిట్ల ఉచిత కరెంట్, గ్యాస్ సిలిండర్‌ను రూ. 500లకు అందజే చేయడానికి రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడంతో హర్షం వ్యక్తం చేస్తూ వారి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగం, తుమ్మనపల్లి రాంప్రసాద్, మర్రి సహదేవ్, పిప్పెర రాజేశ్, ఎండీ రజాక్, సల్మాన్, ఇమ్రాన్, షేక్ మొహమ్మద్ పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లకు అండగా ఉంటా

● కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

కోరుట్ల, ఫిబ్రవరి 6 : సీనియర్ సిటిజన్లకు తాను అండగా ఉంటానని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలో సీనియర్ సిటిజన్ కోరుట్ల రెవెన్యూ డివిజన్ కార్యాలయంతో పాటు నూతన సంవత్సర డైరీ, కేలండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. మలి దశ ఉద్యమంలో తాము మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు వెంట అండగా ఉన్నామని సీనియర్ సిటిజన్లు గుర్తు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీనియర్ సిటిజన్లకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తాని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి హరిఅశోక్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు పబ్బ శివానందం, రాజ్‌మోహన్, సైఫోద్దీన్, నారాయణ ఉన్నారు.

పెద్దమ్మ ఆలయంలో కాత్యాయనీదేవి వ్రతం

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 6 : పట్టణంలోని పెద్దమ్మ ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, సౌభాగ్య కాత్యాయని దేవి వ్రతాలను మహిళలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని పెద్దమ్మ ఆలయంలో ఉదయం నుంచి కాత్యాయనీ దేవి, శ్రీవల్లి దేవసేన, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు క్షీరాభిషేకం, పుష్పార్చన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం శ్రీ కాత్యాయని దేవి వ్రతాలు, కుంకుమ పూజలు అంగరంగ వైభవంగా జరిపించారు. ఉత్సవ మూర్తులతో భక్తులు ఆలయం చుట్టు ప్రదక్షణలు చేసి ఆయలంలో ఏర్పాటు చేయగా సామూహిక వ్రతాలు, కుంకుమ పూజ, వివిధ రకాల పండ్లను స్వామి వారికి అందజేయగా తదితర కార్యక్రమాలను జరిపించారు. అనంతరం శ్రీఐశ్వర్యలక్ష్మి గోశాల తరుపున గాజుల పూజ నిర్వహించి మహిళలకు పసుపు కొమ్ము, గాజులు, పండ్లను భక్తులకు పురోహితుడు ప్రసాదంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు, పాల్గొన్నారు.

బాల్క సుమన్ వ్యాఖ్యలపై

భగ్గుమన్న కాంగ్రెస్



జగిత్యాలలో సీఐకి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 6 : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వాఖ్యలు చేసిన చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి పోలీసులను కోరారు. బీఆర్ఎస్ నాయకుడు సుమన్ కార్యకర్తల సమావేశంలో సీఎంపై అనుచిత వాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో సుమన్‌పై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు. అనంతరం విజయ లక్ష్మి మాట్లాడుతూ సుమన్ అసభ్య పదజాలంతో దూషిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తిని అవమానించేలా మాట్లాడడం దురహంకారానికి నిదర్శనమన్నారు. నాయకులు గిరి నాగభూషణం, రాజన్న, రాజేందర్, దుర్గయ్య, శేఖర్, రవీందర్ రెడ్డి ఉన్నారు.

పెగడపల్లి : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని చెప్పుతో కొడతా అంటూ అనుచిత వ్యాఖ్యలు చేసిన చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చిత్రపటానికి మంగళవారం మండల కాంగ్రెస్ నాయకులు చెప్పుల దండతో సన్మానం చేసి దహనం చేశారు. అనంతరం బాల్క సుమన్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు తడగొండ తిరుపతి, పార్టీ అధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్, నాయకులు కడారి తిరుపతి, వడ్లూరి ప్రవీణ్, చెట్ల కిషన్, బండారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వెల్గటూర్: చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టి బొమ్మను మంగళవారం వెల్గటూర్‌లో కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. అంబేద్కర్ చౌక్ వద్ద కాంగ్రెస్ నాయకులు బాల్క సుమన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బాల్క సుమన్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచ్‌లు మేరుగు మురళి, తిరుపతి, మాజీ ఉప సర్పంచ్ సందీప్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రావు, ఎంపీటీసీలు మంజుల, తిరుపతి పాల్గొన్నారు.

గొల్లపల్లి: సీఎం రేవంత్‌రెడ్డిని అవమానపరుస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై గొల్లపల్లి ఎస్సై నరేష్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. బాల్క సుమన్‌పై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు అందజేసిన వారిలో సరసాని తిరుపతి రెడ్డి, చెవులమద్ది విక్రమ్, సుద్దాల శేఖర్ ఉన్నారు.

మల్యాల: అధికారం పోయిందనే అక్కసుతో సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ



మల్యాలలో సుమన్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు



వెల్గటూర్‌లో బాల్క సుమన్ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఎమ్మెల్యే బాల్క సుమన్ అనుచిత వ్యాఖ్యలు చేశారని పేర్కొంటూ సుమన్ దిష్టిబొమ్మను మల్యాలలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నాయకులు దహనం చేశారు. నాయకులు దొంగ ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, శ్రీనివా స్‌గౌడ్, నేరెళ్ల సతీష్‌రెడ్డి, సంత ప్రకాష్ రెడ్డి, వంశీ, వినయ్, అనిల్ పాల్గొన్నారు

మెట్‌పల్లి రూరల్: మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ నోరు అదుపులో పెట్టుకోవాలి, లేకుంటే ప్రజలు తరిమి కొట్టుతారని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు పిడుగు తిరుపతిరెడ్డి హితవు పలికారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను సుమన్ వెనక్కి తీసుకోని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తాగి మత్తులో ఉన్న నీవు పదవిలో ఉన్నావనుకొని అహంకార పూరితంగా వ్యవహరిస్తే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బండి ప్రశాంత్, నల్ల భూమేష్, డబ్బ రాజారెడ్డి, ఎండీ ఉస్మాన్, మనాల లింగారెడ్డి, జైడి మల్లేష్, పిడుగు మోహన్, రాజారెడ్డి ఉన్నారు.

మేడిపల్లి : మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మను మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు దహనం చేశారు. బాల్క సుమన్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి బాల్క సుమన్‌పై ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు శ్రీపతి దామోదర్, గడ్డం జలంధర్‌రెడ్డి, చేపూరి నాగరాజు, మాదం వినోద్, మ్యాదరి లాజర్, అన్వర్, కుంట శంకర్, నల్ల భూమారెడ్డి, గంగాధర్, శంకర్, నర్సయ్య పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర గీతం ప్రకటన హర్షణీయం

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 6: తెలంగాణ రాష్ట్ర అధికారిక గీతంగా జయజయహే తెలంగాణకు కేబినెట్ ఆమోదం తెలపడంపై తెలంగాణ రాష్ట్ర కాంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ జిల్లా శాఖ బాధ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గంగాధరి మహేష్ మాట్లాడుతూ ప్రజాకవి అందెశ్రీ కలం నుంచి జాలువారిన ఈ అద్భుత గీతాన్ని రాష్ట్ర ప్రభుత్వ గీతంగా ప్రకటించడం ప్రజాపాలనకు నిదర్శనం అని కొనియాడారు. తెలంగాణ పోరాటంలో పాల్గొన్న ప్రతి వ్యక్తి సంతోషపడే సమయం అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ బాధ్యులు మ్యాన పవన్ కుమార్, సర్వ సతీష్, గొల్లపల్లి మహేష్ గౌడ్, జనార్ధన్, బోగ శ్రీనివాస్, వీరబత్తిని శ్రీనివాస్ ఉన్నారు.

కార్యవర్గం

మల్లాపూర్, ఫిబ్రవరి 6: మండలంలోని రేగుంట ఆల్ యూత్ అసోసియేషన్ అండ్ స్పోర్ట్స్ క్లబ్ కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నికైనట్లు సభ్యులు తెలిపారు. అధ్యక్షుడిగా గనవేని మల్లేష్‌యాదవ్, ఉపాధ్యక్షుడిగా ఏలేటి శేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వేములవాడ దేవరాజం, కోశాధికారిగా చెన్నూరి రమేష్, స్పోర్ట్స్ ఇన్‌చార్జిలు ఎండీ ముస్తఫా, నిమ్మల అశోక్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా కుక్కుదుగు అశోక్, కార్యదర్శిగా సిరికొండ మహిపాల్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యవర్గాన్ని సంఘ సభ్యులు సన్మానించారు.

విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలి



విద్యార్థి భవ్యచరణ్‌కు నోట్‌బుక్స్ అందిస్తున్న ఎమ్మెల్యే

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 6 : విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో విజయాలు సాధించాలని ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలానికి వచ్చిన చిన్నారులకు నోట్ బుక్కులు, పెన్నులు అందజేశారు. విద్యార్థులతో మాట్లాడి వారు ఎంచుకున్న లక్ష్యాలను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించాలంటే మేధాశక్తి కావాలన్నారు. అందుకు క్రీడలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. నాంపల్లి భవ్యచరణ్ అను విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించి బుక్కులు అందించారు. ఎంపీపీ మా రు సాయిరెడ్డి, కౌన్సిలర్లు బంగారుకాళ్ల కిషోర్, మన్నేఖాన్, రాజేందర్, నాయకులు పాల్గొన్నారు.

21 వరకు టాస్ పరీక్ష ఫీ గడువు పెంపు

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 6: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ టాస్ దూరవిద్య విధానంలో ఇప్పటికే ప్రవేశం పొంది, ఏప్రిల్‌లో నిర్వహించే పదవ తరగతి, ఇంటర్మీడియేట్ పరీక్షలకు హాజరయ్యే ఓపెన్ స్కూల్ విద్యార్థులు ఈ నెల 12 తేదీ నుంచి 21వ తేదీలోపు పరీక్ష ఫీజు ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చునని టాస్ రాష్ట్ర సంచాలకులు శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో అడ్మిషన్ పొంది పరీక్షలకు హాజరుకాని, ఫెయిల్ అయిన వారు కూడా పరీక్షలు రాసేందుకు అర్హులన్నారు. పూర్తి వివరాలకు ఏఐ కోఆర్డినేటర్ అనుమల్ల శ్యాం తెలిపారు. మరిన్ని వివరాలకు 9849266786ను సంప్రదించాలని కోరారు.

పార్లమెంట్‌లో కాంగ్రెస్ గెలుపునకు

యువతదే కీలక పాత్ర

నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సామ్రాట్ వంశీ



మెట్‌పల్లిలో సామ్రాట్ వంశీని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 6: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి యూత్ నాయకులదే కీలక పాత్ర ఉంటుందని నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సామ్రాట్ వంశీ అన్నారు. మంగళవారం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ నాయకుల పాత్ర కీలకమని, పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ప్రతీఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అమ్ముల రాహుల్, కోరుట్ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పెంట ప్రణయ్, పట్టణాధ్యక్షుడు జెట్టి లక్ష్మణ్, సురేందర్, రీజ్వాన్, చైతన్య, శేఖర్, సోమిడి శివ, అజయ్, చంద్రశేఖర్, గంగాధర్, పాల్గొన్నారు.

పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ టికెట్ కోసం దీక్ష

ధర్మపురి, ఫిబ్రవరి 6: పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ టికెట్ తనకు ఇవ్వాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నేత రాయిల్ల రవికుమార్ ధర్మపురి తహసీల్ ఆఫీస్ వద్ద మంగళవారం విజ్ఞప్తి దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ అనేక ఏళ్ల నుంచి బీజేపీలో క్రియాశీలకంగా పని చేస్తున్నట్లు తెలిపారు. నిరుపేద షెడ్యూల్ కులం కుటుంబం నుంచి వచ్చిన తనకు పెద్దపల్లి పార్లమెంట్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించాలి ఆయన విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా రాయిల్ల రవికుమార్‌ను ఏడాది క్రితమే పార్టీ నుంచి బహిష్కరించామని బీజేపీ నాయకులు తెలిపారు. దీక్షతో పార్టీకి ఎలాంటి సంబంధం లేదన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి

బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యనిర్వాహణ అధ్యక్షుడు వెంకటేశ్వర్

మెట్‌పల్లి, ఫిబ్రవరి 6: పార్లమెంట్ ఎన్నికల్లో బీసీ వర్గాలకు రాజకీయ పార్టీలు ప్రాధాన్యం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యనిర్వహణ అధ్యక్షుడు నల్ల వెంకటేశ్వర్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీ వర్గాలను ఎన్నికల్లో ఓటర్లగా భావించడమే కాకుండా జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు అవకాశం ఇవ్వాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల్లో బీసీ వర్గాల అభ్యర్థులకు మద్దతు పలకాలన్నారు. ఆయా పార్టీలు బీసీ వర్గాల అభ్యర్థులకు ఎంపీ టికెట్ ఇవ్వాలని, పార్టీ టికెట్ ఇచ్చిన వారికి మద్ధతు ఉంటుందన్నారు. లేదంటే ఎంపీ ఎన్నికల్లో, జరగబోయే స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో ఆయా పార్టీలకు బుద్ధి చెపుతామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు బొమ్మల శంకర్, నేమూరి లక్ష్మయ్య, ఆవుల శ్రీకాంత్, మాచర్ల సదానందం, జిందం ప్రతాప్, బాలే అజయ్, వంజరి భూమేశ్వర్, బాస నర్సింగరావు, ఆర్మూర్ రంజిత్, మారంపల్లి నాగరాజు, సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామ శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న విహెచ్‌పీ నాయకులు

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 6 :అయోధ్య బాల రాముని ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని లోక కళ్యాణార్థం జగదాలయ ఆధ్యాత్మిక బృందం ఆధ్వర్యంలో శ్రీరామ శోభాయాత్ర కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. పట్టణం లోని భక్త మార్కండేయ దేవాలయం నుంచి శ్రీరామ శోభాయాత్ర టవర్ సర్కిల్, కొత్త బస్టాండ్ మీదుగా వాసవి గార్డెన్ వరకు నిర్వహించారు. శృంగేరి శారదా పీఠా ధీశ్వరుడు భారతీ తీర్థ మహాస్వా మి, భారతీ తీర్థ పురస్కార గ్రహీత బాచంపెల్లి సంతోష్‌కుమార్ శాస్త్రీలు హాజరు కాగా మహిళలు, భక్తులు కోలాటాలు వేస్తూ శోభాయాత్రలో పాల్గొన్నారు. అనంతరం సాయంత్ర సమయంలో కలశ స్థాపన నిర్వహించగా భక్తులు హనుమాన్ చాలీసా ప్రవచనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కోటగిరి శ్రవణ్ కుమార్, చెట్ల చంద్రశేఖర్, మార కైలాసం, బోనగిరి రామనారాయణ, తవుటు రాంచంద్రంతో పాటు వీహెచ్‌పీ, బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.

విద్యార్థుల విహారయాత్ర

రాయికల్, ఫిబ్రవరి 6: మండలంలోని ఆలూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మంగళవారం విహార యాత్రకు వెళ్లారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఉపాధ్యాయులు ఆట, పాటలతో సరదాగా గడిపారు. అనంతరం వన భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ విహార యాత్రలో రాయికల్ తహసీల్దార్ ఎండీ ఖయ్యూం ముఖ్య అతిథిగా పాల్గొనగా, సీఆర్‌పీలు వెంకటేశ్వర్ రావు, రవీందర్, ఉపాధ్యాయులు సాయికృష్ణ, కిషోర్, కవిత, శృతి, స్రవంతి, నాగరాజు, గోదావరి, ఎస్ఎంసీ చైర్మన్ శేఖర్, మెక్కొండ రాంరెడ్డి, రాజశేఖర్, నల్లాల మల్లారెడ్డి పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ రిపేరింగ్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రాయికల్, ఫిబ్రవరి 6: సెల్‌ఫోన్ రిపేరింగ్ కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రతిమ ఫౌండేషన్ ఆర్గనైజర్ నాగిరెడ్డి రఘుపతి తెలిపారు. రాయికల్ పట్టణంలోని చిన్న జీయర్ స్వామి ట్రస్ట్ భవన్‌లో జీఎంఆర్ వరలక్ష్మి, ప్రతిమ ఫౌండేషన్ సంయుక్తంగా ఈ నెల 15వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రాయికల్ మండలాల్లోని 18 నుంచి 30 సంవత్సరాలల్లోపు వయస్సు కలిగి, 10వ తరగతి పూర్తి చేసిన ఆసక్తి గల నిరుద్యోగ యువకులు దరఖాస్తులను ఈ నెల 10వ తేదీ లోపు సమర్పించాలన్నారు. వివరాలకు 9963347142 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

పశువైద్య శిబిరం

కథలాపూర్, ఫిబ్రవరి 6 : కోరుట్లలోని పీవీ నరసింహారావు పశువైద్యశాల వైద్యులు జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్)లో భాగంగా మండలంలోని గంభీర్‌పూర్, తాండ్రియాల, బొమ్మెన గ్రామాల్లో మంగళవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరంలో 145 పశువులకు గర్భధారణ, గర్భకోశ వ్యాధులకు సంబంధించిన పరీక్షలు, 276 మెడిసిన్ పరీక్షలు, 5 శస్త్ర చికిత్సలు నిర్వహించారు. పశువులకు సోకే వ్యాధులు, నివారణ చర్యల గురించి వైద్యులు రైతులకు వివరించారు. ఎంపీపీ జవ్వాజి రేవతి, వైస్‌ఎంపీపీ గండ్ర కిరణ్‌రావు, ఎన్ఎస్ ఎస్ కోఆర్డినేటర్లు డాక్టర్ అంబిక, డాక్టర్ పరుశురాములు, సురేశ్, దివ్యశ్రీ, ప్రొఫెసర్లు, 67 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి ఆర్థిక సాయం అందజేత

పెగడపల్లి, ఫిబ్రవరి 6 : మండల కేంద్రానికి చెందిన అథ్లెటిక్స్‌లో జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారుడు యోగేష్‌కు పెగడపల్లి తాజా మాజీ సర్పంచ్ మేరుగు శ్రీనివాస్ మంగళవారం రూ. 3 వేలు ఆర్థిక సాయం అందజేసారు. యోగేష్ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఇటీవల మెట్‌పల్లిలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొని 600 మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. ఈ నెల 16, 17, 18 తేదీలలో గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలలో యోగేష్ పాల్గొననున్నాడు. అహ్మదాబాద్ వెళ్లేందుకు ఆర్థిక స్థోమత లేని యోగేష్‌కు తన వంతుగా రూ. 3 వేలు అందించినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు రమేష్ తెలిపారు.

ముగిసిన టెండర్

కొడిమ్యాల, ఫిబ్రవరి 6 : మండలంలోని నల్లగొండ గ్రామ శివారులోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం మంగళవారం నిర్వహించిన టెండర్ ముగిసింది. పట్టి నామాలు, కోరమీసాలు అమ్ముకొనుటకు వేలం నిర్వహించగా లక్ష 51 వేల రూపాయలకు పాటదారుడు దక్కించుకున్నాడు. కొబ్బరి ముక్కలు పోగు చేసుకొనుటకు 35 వేల రూపాయలకు పాట దారుడు దక్కించుకున్నటు ఆలయ ఈవో అనూష తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ సత్యనారాయణ రావు, ఆలయ ఇన్సపెక్టర్ రవికిషన్, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గొల్లపల్లి, ఫిబ్రవరి 6: గొల్లపల్లి మోడల్ స్కూల్‌లో వచ్చే విద్యా సంవత్సరంలో చేరేందుకు ఫిబ్రవరి 22 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్ కుమార్ తెలిపారు. 6 నుంచి 12వ తరగతులకు ఆంగ్ల మాధ్యమంలో చేరేందుకు 100 సీట్లను కేటాయించామన్నారు. 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఖాళీలు ఉంటే కొత్త విద్యార్థులను తీసుకుంటామని పేర్కొన్నారు. ఏప్రిల్ 7వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని, ఆసక్తి గల విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తల్లి చితికి నిప్పుపెట్టిన కూతురు

కోరుట్ల, ఫిబ్రవరి 6 : మండలంలోని అయిలాపూర్‌కు చెందిన ప్రమీల (53) అనే మహిళ తీవ్ర అనారోగ్యంతో బాధ పడి మంగళవారం మృతి చెందింది. మూడు మాసాలుగా మెదడు సంబంధిత వ్యాధితో బాధ పడుతుండగా బాధ తీవ్రమై మరణించగా బంధువుల సహకారంతో అంత్యక్రియలు నిర్వహించారు. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు కాగా తల్లి మృతదేహానికి చిన్న కూతురు లావణ్య తలకొరివి పట్టి చితికి నిప్పంటించింది. ఈ ఘటనను చూసి గ్రామస్థులు, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు.

తప్పుడు ఫిర్యాదు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

డీఎస్పీకి వినతి పత్రం అందజేసిన ఆత్మకూర్ గ్రామస్థులు



మెట్‌పల్లిలోని డీఎస్పీ కార్యాలయం ఎదుట ఆత్మకూర్ గ్రామస్థులు

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 6 : మండలంలోని ఆత్మకూర్ గ్రామాభివృద్ధి కమిటీపై మెట్‌పల్లి పోలీసు స్టేషన్‌ల్లో తప్పుడు ఫిర్యాదు చేసిన గౌడ గీత పారిశ్రామిక సహకార సంఘం సభ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు మంగళవారం మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఏడ్మల నర్సారెడ్డికి చెందిన 23 ఎకరాల భూమిని గ్రామస్థుల సమక్షంలో 2002లో గీత పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు కొనుగోలు చేసారన్నారు. కానీ ఆ భూమిలోని కొంత భాగాన్ని సంఘ సభ్యుడికి గుట్టు చప్పుడు కాకుండా విక్రయించారన్నారు. దీంతో ఆత్మకూర్ వీడీసీ సభ్యులు గ్రామంలో నిర్వహించిన సమావేశానికి హాజరు కావాల్సిందిగా గీత పారిశ్రామికులను కోరారు. దీంతో గీత సహకార సంఘం సభ్యులు వారం రోజుల సమయం కావాలని కోరారు. వారు హాజరు కాకపోవడంతో భూమి రిజిస్ట్రేషన్ నిలిపివేయాలని రెవెన్యూ అధికారులకు, మెట్‌పల్లి సీఐని కోరినట్లు పేర్కొన్నారు. దీంతో గీత సహకార పారిశ్రామిక సభ్యులను బహిష్కరణ చేసామని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులపై పోలీసు స్టేషన్‌ల్లో తప్పుడు ఫిర్యాదు చేయడంతో డీఎస్పీకి సమస్యలను తెలిపి సామరస్యపూర్వకంగా పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు రమేష్, సురేష్, నర్సయ్య, సురేందర్, లక్ష్మినారాయణ, లింగం, వెంకట్, రాజలింగం, సాయన్న, బండ స్వామి, గోపిడి మల్లయ్య, రాజేందర్, రాజలింగం పాల్గొన్నారు.